క్లుప్తంగా

కేంద్రం నిధులపై రాజకీయమెందుకు!


గిరజాల వీర్రాజు

కడియం: కేంద్రం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదివేల కోట్ల రూపాయల నిధులు తీసుకువస్తే అభినందించాల్సింది పోయి, రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ ఢిల్లీ వెళ్లినప్పుడల్లా తన కేసుల కోసమే వెళుతున్నారని తప్పుడు ప్రచారం చేసిన ఎల్లో మీడియా, నాయకులు కళ్లు తెరవాలన్నారు. అధికారంలో ఉండగా టీడీపీ రాష్ట్రానికి నిధుల తీసుకురాలేకపోయిందన్నారు. అప్పుడు ఎందుకు విఫలమయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ సమర్థుడు కనుకనే 2014-15 రెవెన్యూ లోటు నిధులను తీసుకు రాగలిగారన్నారు.

26న రెసిడెంట్ డాక్టర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న 55 సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పోస్టుల భర్తీకి ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వెంకటేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సాధారణ వైద్యం 2, సాధారణ శస్త్రచికిత్స 5, అనస్తీషియా 2, కంటి శాస్త్రం 2, డీవీఎల్ 1, రేడియాలజీ 3, అత్యవసర వైద్యం 8, అనాటమీ 5, శరీర శాస్త్రం 3, బయోకెమిస్ట్రీ 4, ఫార్మకాలజీ 4, పాథాలజీ 5, మైక్రోబయాలజీ 4, ఫోరెన్సిక్ మెడిసిన్ 3, ఎస్‌పీఎం (కమ్యూనిటీ మెడిసిన్) 4 తదితర.. మొత్తం 55 పోస్టులు భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అలాగే రాజమహేంద్రవరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో బోధనా ఆసుపత్రి స్థాయిని 350 పడకలకు పెంచామన్నారు. వచ్చే ఏడాదికి 350 పడకల నుంచి 430, తదుపరి ఏడాది 500 పడకలకు పెంచుకుంటూ 600 స్థాయికి అభివృద్ధి చేస్తామన్నారు. అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలను సరఫరా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి బ్యాచ్ 150 మెడికల్ సీట్లు భర్తీ చేస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కంబాలచెరువు: స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలి.

సంహితలో క్యాంపస్ డ్రైవ్

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో దివీస్ ల్యాబరేటరీస్ ఇంటర్నేషనల్ ఫార్మా కంపెనీ మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించిందని కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 138 మంది విద్యార్థులు హాజరు కాగా 69 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ఎంపికైన వారికి రూ.2.80 నుంచి రూ.3.60 లక్షలు సంవత్సరాదాయం ఉంటుందన్నారు. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, హెచ్‌ఆర్ రాజేష్ ఆధ్వర్యంలో బీఎస్సీ లైఫ్ సైన్స్, కెమిస్ట్రీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. కళాశాల ఏవో జి.బాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బీబీఎస్ రామచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి తరుణ్ పట్నాయక్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరానికి చెందిన తరుణ్ పట్నాయక్ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2022 తుది ఫలితాలలో 33వ ర్యాంకు సాధించడంపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన సివిల్ సర్వీసెస్ 2021 తుది ఫలితాలలో తరుణ్ పట్నాయక్ 99వ ర్యాంకు సాధించి, సిమ్లాలోని ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్ నందు ట్రైనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం విడుదలైన సివిల్ సర్వీసెస్ తుది ఫలితాలలో 33వ ర్యాంకు సాధించడం మరింత ఆనందాన్ని ఇచ్చిందన్నారు. యువత తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. తరుణ్ పట్నాయక్ తండ్రి ఎంఆర్‌కే పట్నాయక్ జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ట్రస్టీ సభ్యుడిగా కొనసాగుతూ విశేషమైన సేవలందిస్తున్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ

కంబాలచెరువు: పాము, ఇతర విషకీటకాల బారిన పడిన రోగులకు అందించాల్సిన ప్రథమ చికిత్సపై మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాకులో మంగళవారం శిక్షణ ఇచ్చారు. దీన్ని మెటర్నల్ హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు ప్రారంభించారు. విష కీటకాల బారిన పడినప్పుడు ఇంజెక్షన్లు ఇచ్చే విధానం, గాయాలకు డ్రెస్సింగ్ చేయడం, కుట్లు వేయడం, బేసిక్ లైఫ్ సేవింగ్ స్కిల్స్ వంటి పలు అంశాలపై ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఈ తరగతులు జరుగుతాయన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్లలో వైద్య సేవలను మెరుగుపరిచి బలోపేతం చేసేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. డాక్టర్ అభిషేక రెడ్డి, డేవిడ్, శివకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ రోడ్‌షో ఏర్పాట్ల పరిశీలన


అధికారులు, మహిళలకు సూచనలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా బుధవారం కొవ్వూరులో జరిగే రోడ్‌షో ఏర్పాట్లను సంబంధిత సిబ్బందితో కలిసి మంగళవారం కమిషనర్ దినేష్ కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హెలిప్యాడ్ నుంచి మీటింగ్ జరిగే ప్రదేశం వరకూ ఉన్న ప్రాంతాన్ని ఐదు స్ట్రెచ్‌లుగా విభజించి, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అక్కడకే వలంటీర్లు, డ్వాక్రా సిబ్బందిని రప్పిస్తున్నామన్నారు. గ్యాలరీలలో ఉన్న వారికి ప్లకార్డులు నగరపాలక సంస్థ ద్వారా అందజేస్తామన్నారు. రోడ్‌షోలో పాల్గొనే మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. తాగునీరు, మజ్జిగ, అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశామన్నారు. కాగా.. పారిశుధ్యపరంగా ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, కొవ్వూరు కమిషనర్ శ్రీకాంత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, కొవ్వూరు మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి విశేష కృషి

- జగన్ పాలనలో రాష్ట్రాభ్యున్నతి
- శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు


మోషేన్‌రాజు

రాజమహేంద్రవరం సిటీ: పేదల సంక్షేమంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధికి, మౌలిక వసతులు, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం విచ్చేసిన ఆయన హోటల్ మంజీరాలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. పరిశ్రమల స్థాపనకు వైజాగ్ సమ్మిట్ బాగా ఉపయోగ పడిందన్నారు. పారిశ్రామిక దిగ్గజాలు అదానీ, అంబానీలు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు స్థాపనకు తరలివస్తున్నారన్నారు. పేదలకు విద్యావకాశాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన ప్రభుత్వం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ మొక్కటేనన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయడం అద్భుతమైన విషయమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని తీసుకు వచ్చారన్నారు. పింఛన్ల పంపిణీని ప్రతినెలా ఒకటోతేదీ తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా అందిస్తున్న ప్రభుత్వం దేశంలో ఇదొక్కటేనన్నారు. ఆయన వెంట ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్ ఉన్నారు.

స్వామి అనుగ్రహంతో సకల శుభాలు


భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న రామచంద్ర రామానుజ జీయర్ స్వామి

సీటీఆర్ఐ: వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో సకల శుభాలు కలుగుతాయని త్రిడండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి స్వామివారికి పుష్కర బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో గోవిందుడికి శ్రీపుష్పయాగం, ద్వాదశారాధనలు, ఏకాంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలో స్వామివారికి సాక్షాత్తూ బ్రహ్మ పూజలు నిర్వహించారని, అప్పటి నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాగా.. బుధవారం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వరదలను సమష్టిగా ఎదుర్కొందాం


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న సీఈ సతీష్ కుమార్

ధవళేశ్వరం: వరదలను సమష్టిగా ఎదుర్కొందామని గోదావరి డెల్టా సిస్టమ్ సీఈ ఆర్.సతీష్ కుమార్ అన్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం ఫ్లడ్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఈ సతీష్ కుమార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో లస్కర్ల నుంచి ఫ్లడ్ కన్జర్వేటర్ వరకూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటిగట్ల వెంబడి బలహీన ప్రాంతాలను గుర్తించి, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వరదల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులతో చర్చించారు. అవుట్ ఫాల్ స్లూయిజ్, ఫ్లడ్ మెటీరియల్స్, సిబ్బందిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదల్లో ఎటువంటి నష్టం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదల సమయంలో ప్రమాద హెచ్చరిక స్థాయికి ఉధృతి చేరినప్పుడు సిబ్బంది అంతా అందుబాటులో ఉండాలన్నారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. సమావేశంలో ఫ్లడ్ కన్జర్వేటర్, హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, అసిస్టెంట్ ఫ్లడ్ కన్జర్వేటర్లు రామ్‌గోపాల్, పి.విజయ్‌గోపాల్, సుబ్బయ్య, నాగార్జునరావు, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

వృద్ధులను కాపాడిన కానిస్టేబుల్


వృద్ధ దంపతులను కాపాడిన కానిస్టేబుల్ బషీరుద్దీన్

కంబాలచెరువు: వ్యక్తిగత కారణాలతో రాజమండ్రి రోడ్ కం రైలు బ్రిడ్జి నుంచి గోదావరిలో దూకేందుకు ప్రయత్నిస్తున్న వృద్ధ దంపతులను గోపాలపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బషీరుద్దీన్ మంగళవారం కాపాడాడు. ఆ సమయంలో అటుగా వెళుతూ కానిస్టేబుల్‌కు వృద్ధ దంపతులు గోదావరి బ్రిడ్జిపై అనుమానాస్పదంగా కనిపించారు. వారు బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్నారు. గమనించిన బషీరుద్దీన్ వెంటనే వారిని అడ్డుకున్నాడు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రెండో పట్టణ పోలీసులకు అప్పగించాడు. ఆర్థిక ఇబ్బందుల ఇబ్బందుల కారణంగా వీరు ఆత్మహత్యకు యత్నిస్తున్నట్టు తెలిసింది.

డీఎల్‌ఎస్‌ఏ ప్యానెల్ లాయర్లకు సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: ప్రొబోనో మరియు టెలీలా స్కీమ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్, పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ విధి విధానాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ప్రజలకు ఉచిత న్యాయసేవలు అందించడమే ప్రొబోనో న్యాయసేవల ముఖ్య ఉద్దేశమన్నారు. సేవాభావం ఉన్న న్యాయవాదులు జిల్లా న్యాయ సేవాధికారసంస్థలో నమోదై ప్రజలకు న్యాయ సేవలను అందించాలన్నారు. న్యాయస్థానాలు లేని మారుమూల గ్రామాల ప్రజలకు ఫోన్‌కాల్ ద్వారా న్యాయ సలహాలు అందించడం కోసం టెలీలా స్కీమ్ ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు పంచాయతీ కార్యాలయాల్లో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా, ప్లేస్టోర్ నుంచి టెలీలా యాప్ డౌన్లోడ్ చేసుకొని స్లాట్ బుక్ చేసుకుంటారన్నారు. ఆ సమయంలో న్యాయవాదులు కనీసం 20 నిమిషాల పాటు వారి సమస్యలు తెలుసుకుని తగిన న్యాయ సలహా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముద్దాయిలకు, విచారణలో ఉన్న ఖైదీలకు సత్వరమైన మెరుగైన న్యాయసేవలు అందించడమే లక్ష్యంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ పనిచేస్తుందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని సంపత్‌నగరంలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. జగన్ ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వారికి వివరించారు. సంపత్‌నగరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఘనంగా స్వాగతం లభించింది. ప్రజలు ఆయనను ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసం తగదు

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న విద్యాదీవెన పేరుతో జగన్ అట్టహాసం చేస్తున్నారని మాజీ ఎంపీ హర్షకుమార్ విమర్శించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం కొవ్వూరులో ఇంత భారీ ఎత్తున రెండో విడత విద్యా దీవెన ప్రారంభించడం అవసరం లేదని వ్యాఖ్యానించారు. తెలుగుదేశం, జనసేన కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రయోజనాలు ఉంటాయన్నారు.

హేవలాక్.. అదిరే లుక్..


విద్యుద్దీప కాంతులతో కనువిందు చేస్తున్న హేవలాక్ బ్రిడ్జి

రాజమహేంద్రవరం కళకళలాడుతోంది. అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. నగర సుందరీకరణ శరవేగంగా జరుగుతోంది. అందులో భాగంగా 125 ఏళ్ల చరిత్ర కలిగిన సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవున్న హేవలాక్ బ్రిడ్జ్‌ను విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అక్కడి వచ్చిన సందర్శకులు ఆ అందాలను చూసి ముగ్ధులవుతున్నారు. సోమవారం రాత్రి హేవలాక్ ఇలా సూపర్ లుక్‌లో కనువిందు చేసింది.

– రాజమహేంద్రవరం సిటీ

అంతా మాఇష్టం..


జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ బైక్‌కు చార్జింగ్ పెట్టిన దృశ్యం

బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగులు తాము వినియోగించే ఎలక్ట్రికల్ బైక్‌లకు కళాశాల్లోనే చార్జింగ్ పెడుతున్నారు. ఇంటి వద్ద పెట్టుకుంటే కరెంటు బిల్లు ఎక్కువ వస్తుందని భావించి, ఇలా చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అంతా మాఇష్టం అన్నరీతిలో వ్యవహరిస్తున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

పథకాల అమలులో వలంటీర్లు కీలకం


వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

కడియం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే వారధులు వలంటీర్లేనని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. జేగురుపాడు, మాధవరాయుడుపాలెం గ్రామ వలంటీర్లకు గురువారం జేగురుపాడులో మంగళవారం సేవా పురస్కారాలు అందజేశారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అవినీతి, లంచాలతో నిండిపోయిన వ్యవస్థలను సచివాలయం, వలంటీర్లతో ముఖ్యమంత్రి జగన్ ప్రక్షాళన చేశారన్నారు. ప్రభుత్వం ద్వారా అందే ప్రతి సేవను ప్రజల ఇంటి గుమ్మం వద్దకే పారదర్శకంగా వలంటీర్ల ద్వారా చేరవేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల మంది వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వారి సేవలకు గుర్తింపుగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర కేటగిరీల్లో పురస్కారాలను ప్రదానం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా జేగురుపాడు, మాధవరాయుడుపాలెం గ్రామాల పరిధిలో 64 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున అందజేస్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), జేఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మహిళా నాయకురాలు ఊటుకూరి శైలజ మాట్లాడారు. సంగిత వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి శివాజీ, పుట్టా బుజ్జి, నాగిరెడ్డి మోహన్, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రరావు, పంచాయతీ కార్యదర్శి శిరీష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బొమ్మూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్)లో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు లభించాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.కొండలరావు తెలిపారు. డెల్టా హాస్పిటల్, రాయల్ ఎన్‌ఫీల్డ్, మోహన్ స్పిన్‌టెక్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీల్లో వంద ఉద్యోగాలుండగా, 94 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. వీరిలో అర్హత కలిగిన 26 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశామన్నారు. ప్రతినెలా రెండో శుక్రవారం జాబ్‌మేళా, నాలుగో మంగళవారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కొండలరావు తెలిపారు. అనంతరం నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ జున్నూరి రాజు చేతుల మీదుగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ రాజ్‌కుమార్, రాజా కలేబ్ పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ


మాట్లాడుతున్న డాక్టర్ వసుంధర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర పిలుపునిచ్చారు. శంభూనగర్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో సర్వారాయ షుగర్స్ లిమిటెడ్ (కోకోకోలా) యాజమాన్యానికి మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సర్వారాయ షుగర్స్ కడియం, రూరల్ మండలాల్లోని వంద మంది టీబీ బాధితులకు ఆరు నెలల పాటు రూ.3.90 లక్షలు విలువైన పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. కోకోకోలా కంపెనీ చీఫ్ ఫైనాన్స్ అధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ క్షయ బాధితులు చెడు అలవాట్లుకు దూరంగా ఉండి వైద్యులు సూచనలు మేరకు నడుచుకోవాలన్నారు. అనంతరం కె.శ్రీధర్, జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కృష్ణమూర్తి, ఇతర సిబ్బందిని వైద్యబృందం సత్కరించింది. క్షయ బాధితులకు అతిథుల చేతుల మీదుగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ టి.మనోజ్, డీఎస్ఎం డాక్టర్ లక్ష్మీదేవి, టీబీ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, శేషగిరిరావు, సుజ్ఞాన కుమారి, జి.సత్యవతి పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, ప్రజలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్టు బీట్ ఆఫీసర్లు దూడ ఆశారేఖ, అర్చన, మధుమోహన్ అన్నారు. స్టేట్ సివికల్చరిస్ట్ షేక్ సలాం ఆదేశాల మేరకు అటవీయేతర ప్రాంతంలో మొక్కల విస్తరణ ద్వారా పర్యావరణాన్ని బలోపేతం చేయడంపై మంగళవారం బొమ్మూరులోని నయారా పెట్రోలు బంక్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోలు అధికంగా వాడటం వలన కాలుష్యం పెరుగుతోందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు.

స్కూళ్లు ప్రారంభమయ్యేనాటికి పాఠ్యపుస్తకాలు

కడియం: పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉమ్మడి జిల్లాల ఎన్‌టీ బుక్స్ మేనేజర్ పి.సురేష్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలోని విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను సందర్శించి, పుస్తకాల పంపిణీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సెమిస్టర్ 1 పుస్తకాలు 36,24,536, అలాగే 96 టైటిల్స్ అవసరం కాగా ఇప్పటి వరకు 66 టైటిల్స్‌లో 19,38,479 పుస్తకాలను 64 మండలాలకు పంపించామన్నారు. మిగిలిన 30 టైటిల్స్ 16,86,057 పాఠ్య పుస్తకాలను ఈ నెలాఖరుకల్లా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరిచిన మొదటి రోజునే ప్రతి విద్యార్థి చేతిలోనూ పుస్తకాలను ఉంచాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కడియం మండల పరిధిలోని సెమిస్టర్ 1 పాఠ్య పుస్తకాలు 52,347 అవసరం కాగా ఇంత వరకు 29,772 పుస్తకాలను అందజేశామని ఎంఈవో లజపతిరాయ్ ఆయనకు వివరించారు. విద్యాకానుక కిట్ల కన్వీనర్, స్కూలు హెచ్ఎం సత్యనారాయణ, ఎంఆర్‌సీ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.